


# పల్లెకు పోదాం

-డా. కాలువ మల్లయ్య

"నా పేరు చేతన్... మాది మీ పక్క ఊరే సార్..."

"నా పేరు జగదీశ్... మాది మీ ఊరే..."

నాకెదురుగా కుర్చీల్లో కూర్చుంటూ అన్నారా యువకులు. "మీరు నా దగ్గరికి రావడం ఆనందంగా ఉంది... ఊళ్ళో అంతా బాగున్నారా...?"

"ఏం బాగుసార్... ఏదో ఉన్నారంటే ఉన్నారు..." అన్నాడు జగదీశ్... "మీరిప్పుడు ఎక్కువ సమయం హైదరాబాద్‌లోనే ఉంటున్నారు కదా సార్... మీకు పల్లెటూళ్ళంటే చాలా ఇష్టం కదా...! ఆ జనారణ్యంలో ఎట్లుంటున్నారు...?"

చేతన్ ప్రశ్న జగదీశ్ జవాబు సూటిగానే తగిలాయి. ఎన్నెన్నో జ్ఞాపకాలను తట్టి లేపాయి... కొద్ది క్షణాలు మౌనంగా ఉన్నాను.

"అవును... అది జనారణ్యమే... ఊళ్ళలో లభించే ప్రేమలు, ఆప్యాయతలు అక్కడ దొరకవు... అయినా పిల్లల చదువుల కోసం, ఇతర పనుల దృష్ట్యా ఉండక తప్పడం లేదు..." అన్నాను.

"ఆ తర్వాత మనూల్లోనే ఉండుండ్రి... ఈ కరీంనగర్‌లో కూడా వద్దు... మీకు మన ఊరంటె చాలా ప్రేమ కద...!" అన్నాడు జగదీశ్.

"తప్పకుండా...! సరేగాని జగదీశ్ నిన్ను చూసినట్టు గుర్తు కాని ఎవరికొడుకువో సరిగ్గా గుర్తుకు రావడం లేదు."

"నేను మ్యాకల అంజయ్య కొడుకును సార్..."

మ్యాకల వాళ్ళు మా ఊళ్ళో దళితులు... నా బాల్యంతో దళితులపై ఎంతో వివక్ష ఉండటం గమనించాను. వాళ్ళను గుళ్ళోకి పోనిచ్చే వాళ్ళు కాదు... బతుకమ్మ ఆడటానికి కూడా వీల్లేదు... అయ్యబాంచెను, అవ్వ బాంచెను అనుకుంటూనే బతకాలి. అలాంటి కుటుంబంలోంచి వచ్చిన జగదీశ్ ఈరోజు దర్జాగా, ఆత్మవిశ్వాసంతో ఉండటం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

"నాకంటె కొంత సీనియర్ మ్యాకల నారాయణ... ఆ కాలంలోనే పి.యు.సి. చదివాడు... మధ్యప్రదేశ్‌కు పోయాడు... అక్కడే ఉన్నాడా...?"

"ఆయన మా చిన్నాయిన సార్... అక్కడే స్థిరపడ్డాడు..."

"మరి మీ కుటుంబం...?"

"మా అన్న హైదరాబాద్‌లో రాయ్ యూనివర్శిటీలో రీడర్... నేనిక్కడే ఉద్యోగం చేస్తున్నాను."

"వెరీ గుడ్... మనూల్లో దళితులు చాలామందే ఉద్యోగాలు చేస్తున్నారు కదా..."

"అవును సార్..."

"సరే గాని నాకు పట్టణ జీవితం మీద అంతగా మోజు లేదని, పల్లెలంటే ఇష్టమని ఎలా గ్రహించారు...?"

"మీ కథల్లో మీ హృదయం ఉంటుంది కదా సార్..."

"మీ కథల్లోని ప్రతి పాత్రనూ, సన్నివేశాన్నీ గుర్తించగలం సార్... అవన్నీ మన ఊరు, మన ఊరులాంటి ఊళ్ళలోంచి తీసుకున్నవే కదా...!"

వాళ్ళ మాటలు నన్ను ఆనందపరవశున్ని చేస్తున్నాయి... నా ఊరు యాదులెన్నో నా కండ్లముందు తిరుగుతున్నాయి...

అన్నా, తమ్మీ, అక్కా, చెల్లీ, తాతా, మనుమడా, బావా, బామ్మర్దీ, మామా, అల్లుడా, అత్తా, కోడలా అని వరుసలు పెట్టుకొని ఆప్యాయంగా పిలుచుకునే ప్రేమానురాగాలు గల మనుషులు... ఒకరి అవసరాల్లో ఒకరు ఆదుకునే మంచి గుణాలు... ఇంటికొచ్చిన మనిషికి కుండల గలది కలోగంజో కడుపునిండా తినిపించే దాతృత్వాలు నన్ను వివశున్ని చేస్తున్నాయి...

నేనాడిపాడిన స్థలాలు... ఎగురుతూ దుముకుతూ గంతులేసిన చేల్లు చెలుకలు... ఈతకొట్టిన చెరువు... ఎక్కి దుమికిన గుట్టలు... రాళ్ళపై చెక్కుకున్న పేర్లు... చెరువుకట్ట మూలకున్న రామప్పగుడి... ఊరవతలున్న బడి... బతుకమ్మ వాగు జ్ఞాపకాలన్నీ నన్ను వెంటాడుతున్నాయి...

"సార్... మమ్ములనిక్కడ కూచోబెట్టి మీరు ఊరు జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోతే ఎలా?"

చేతన్ మాటలకు నవ్వాను...

"మా నాన్న తరం పెద్ద మనుషులంతా బాగున్నారా...?" అన్నాను కొద్ది క్షణాలాగి.

"వాళ్ళు చాలామంది చనిపోయారు సార్...! మీ చిన్నాయిన్న, మెండె రాజయ్య లాంటోల్లు కొద్దిమందే ఉన్నారు. ఇప్పుడు మీ తరం వాళ్ళే ఊళ్ళె పెద్ద మనుషులన్నట్టు..."

నేను తాతా, మామా, బాపూ అని పిలిచే తరం, నన్నాశీర్వదించిన తరం వాళ్ళంతా వెళ్ళిపోయారన్న సత్యం నాకు బాధాకరంగానే ఉంది.

"సరే గాని ఊరు బాగుందా...?" అన్నాను.

"ఊరు గురించి మీకు చెప్పేవాళ్ళం కాదు సార్ మేం... మునుపు బాగుందో, ఇప్పుడు బాగుందో తెలువది కాని చాలామంది వృత్తులు కోల్పోయారు. పొట్టలు చేతుల్లో పట్టుకొని వలసలు పోతున్నారు. చాలా వ్యవసాయాలు మూలకు పడ్డాయి... అంతా వడ్లు పెరుగు కలిపినట్టనిపిస్తుంది."

ఆ మాటల్లోని సత్యాలు నాకు తెలియనివి కాదు.

"మీరు ఊరికి పోక చాలా రోజులయిందని అనుకుంటున్నారు... మా అమ్మగారూరు అదే సార్..."అన్నాడు చేతన్.

"అవును... అనేక కారణాలవల్ల, పనుల ఒత్తిడివల్ల ఈసారి ఊరికి పోక చాలారోజులే .అయింది. ఓసారి పోయి అందరితోని కడుపునిండ మాట్లాడిరావాలి..." అన్నాను.

"మీరు ఊళ్ళగూర్చి, జరుగుతున్న సామాజిక, ఆర్థిక, సాంఘిక పరిణామాల గూర్చి అనేక రచనలు చేసారు. నశిస్తున్న విలువలు, పతనమవుతున్న మానవ సంబంధాలు, వృత్తుల గూర్చి రాసారు. అయితే ఇటీవలి కాలంలో మీరు రాస్తున్న కథల్లో వెనుకటి కాలమే బాగుండేదన్న ధోరణి ప్రతిధ్వనిస్తుంది. అంటే మీరు గతం వర్తమానం కంటె గొప్పదని నమ్ముతారా...?"

నన్ను నేను ప్రశ్నింపజేసుకునే, ఎన్నెన్నో విషయాలను మననం చేసుకునే ప్రశ్న వేసాడు జగదీశ్. ఆ ప్రశ్న నాకు కన్నీళ్ళనూ తెప్పించింది. జవాబు సిద్ధంగానే ఉన్నా భావం చెడకుండా చెప్పడం కొంత కష్టంగానే ఉంది.

కళ్ళు మూసుకొని కొద్ది క్షణాలాలోచించాను.

నా చిన్నతనంలో నా వాళ్ళనుభవించిన అవమానాలు... చదువుకోవడానికి నేను పడ్డ కష్టాలు... నీ కొడుకును కూడా చదివిస్తావురా అంటూ మా నాన్నను దొరలు దెప్పడం లాంటివన్నీ జ్ఞాపకం వచ్చి హృదయం భారమైంది.

"ఈ ప్రశ్న మీకేమైనా బాధ కలిగించిందా సార్...!" అన్నాడు చేతన్...

"నో... నో... అలాంటిదేం లేదు. నేనూ మీలాగే పీడిత వర్గంలోంచి వచ్చిన వాన్నే... చదువుకుంటానికి ఎన్నో కష్టాలు పడ్డాను. గొర్లకాపర్లుగా మా వాళ్ళు పడ్డ అవమానాలు చూసాను. వెట్టి మందులు పెట్టడం తెలుసు. నా బాల్యం కూడా అందరు పీడిత కులాల వారి బతుకులా అవమానాలతోనే గడిచింది. అదంతా పీడనతో కూడుకున్నదే. గతం పీడిత జాతుల వారికెప్పుడూ గొప్పది కాదు.

మనం గెలుచుకున్న జీవితమే, గెలుచుకుంటున్న జీవితమే గొప్పది. మంచి గతమున కొంచెమేనోయ్ అన్న గురజాడ మాటల్ని నమ్ముతాను నేను..."

"మరి మీరు పోతుందనుకున్న మంచి..."

"అయితే ఫ్యూడల్ వ్యవస్థలోనూ కొంత మంచుంది. ఆ కాస్త మంచీ గ్రామాల్లోకి రూపాయితనం ప్రవేశంతో మటుమాయమై పోతుంది. ప్రేమలు, దగ్గరితనాలు, బోల్లకోరితనం మచ్చుకు లేకుండాపోతూ మనుషులు యంత్రాలుగా మారుతున్నారన్న బాధే తప్ప గతాన్ని కీర్తించడం నేనే కథలోనూ చేయలేదు. నేనప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా పల్లెలను సమర్థిస్తాను..."

నా మాటలకు అంగీకార సూచకంగా తలలూపారు వాళ్ళు.

"మీరు మాకు తినడానికి ముందు పెట్టిన చకినాలు, గారెలు ఇంట్లోంచి వస్తున్న గంజు పిండి వాసన దేశీయతను గ్రామీణ సంస్కృతీ సాంప్రదాయాలను హృదయానికి హత్తుకున్నారనే చెబుతున్నాయి. ఉద్యోగ రీత్యా, ఇతరత్రా మీరెక్కడ నివసిస్తున్నా మీరు గ్రామాలనే ప్రేమిస్తున్నారనీ అర్థమవుతుంది. ఏముంది సార్ గ్రామాల్లో...? అవి ఫ్యూడల్ కేంద్రాలే కదా...! సంకుచిత కులాధిపత్యాలు, అంటరానితనం, అంతరాలు, ఇవేకదా గ్రామాల్లో ఉన్నది. అలాంటి గ్రామాలపై మీకెందుకంత ప్రేమ? ఎవర్ని బతికించాయి...? పోతే పోనియ్యండ్రి..."

జగదీశ్ మాటల్లో ఎంతో లోతుంది. విషయాలనెంతో లోతుగా అధ్యయనం చేసిన వాళ్ళుగా కనబడ్డారా యువకులు. ఆ ప్రశ్నలకు జవాబులివ్వడం కొంత కష్టంగానే ఉన్నా స్పష్టమైన జవాబులు సిద్ధంగానే ఉన్నాయి. ఆ ప్రశ్నలు నన్ను మరోసారి బాల్యంలోకి గ్రామాలను 'యాది' చేసుకునేట్టు చేసాయి. 60, 70లలో నేను చదువుకుంటున్న రోజుల్లో చూసిన గ్రామాలు నా కళ్ళముందు కదిలాయి.

నాడెలు అటూ ఇటూ తిరుగుతూ మగ్గం చప్పుల్లు... వలుపల దాపల ఎడ్లగట్టుకొని ముల్లుగర్ర చేతబట్టుకొని సాగుబాటయ్యే దృశ్యాలు... గొర్రెబొక్కుల స్వరాలతో కష్టంతో చల్లగిలికే చప్పుల్లతో గొల్లలిండ్లు... కుండలు చేస్తూ కుమ్మరి, కొలిమి ఊదుతూ కమ్మరి... నగలు చేస్తూ స్వర్ణకారులు... కట్టె పనిచేస్తూ వడ్రంగి... రకరకాల పండ్లమ్ముతూ తెనుగువాళ్ళు... తోపెలతో చేపలు పడుతూ బెస్తలు... పొద్దాటి పరుపుదాటి కల్లు గీస్తూ గౌండ్లు... సామాజికావసరాలను తీర్చే ఉత్పత్తులు చేస్తూ దళితులు... చిరుతలు వాయిస్తూ పరుగెత్తే ఉరుకులమోర్లు... జానపద కథలు చెప్పుతూ శాందాకాళ్ళు... మందెచ్చులోల్లు... చిందు భాగోతులు... సాధనాసురులు... ఒగ్గోల్లు... వివిధ రకాల వృత్తులు చేస్తూ బతికే సహస్ర వృత్తులవాళ్ళు నా కళ్ళ ముందు నిలిచారు.

"జగదీశ్... ఊళ్లు ఒకప్పుడు, కొంతవరకు ఇప్పుడు కూడా ఫ్యూడల్ కేంద్రాలయితే కావచ్చు. కాని, సర్వసంపదలకు సృష్టికర్తలైన వాళ్ళుండే స్థలాలు ఊళ్ళే. మనిషి బతకడానికవసరమయ్యే అన్ని సంపదలనూ సృష్టించేది గ్రామీణులే నన్న విషయాన్ని మరిచిపోకూడదు. అందుకే ఊరును సృష్టికర్తల చిరునామా అంటాను. మట్టిలో మట్టయి బీళ్లను సేద్యయోగ్యం చేసి అన్నిరకాల పంటలను, మానవావసరాలను తీర్చే ఉత్పత్తులను చేసేది గ్రామీణులే... సృష్టికర్తలైనా జనాలను తక్కువగా చూడటం వల్లనే ఈ సమస్యలొస్తున్నాయి. పనిని గౌరవించే సంస్కృతి మన దేశంలో ఉంటే వీళ్ళకు సమున్నత గౌరవం లభించేది. అది లేకపోవడంవల్లనే ఊళ్ళు ఫ్యూడల్ కేంద్రాలయ్యాయి. సంపద సృష్టించేవాడి దగ్గరే సంపద ఉండకపోవడం ఈ దేశంలోని ట్రాజెడీ... ఇందుక్కారణం మనిషి సృష్టించుకున్న వర్ణ వ్యవస్థ నియమ నిబంధనలే. ఆ ఒక్క విషయాన్ని తీసేస్తే ఊళ్ళకున్న శాశ్వతత్వం వేటికుంది...?"

నా మాటల్ని శ్రద్ధగా వింటున్నారాయువకులు..

"పట్టణాలు, పారిశ్రామికీకరణ ఇవన్నీ తాత్కాలికాలే... కొంతకాలానికి భూమ్మీదున్న వనరులు తరగిపోక తప్పదు. ఇవేవీ లేనప్పుడూ ఊళ్ళున్నాయి. ఊళ్ళకున్న శాశ్వతత్వం వేటికీ లేదు... మనుషులు, జీవరాశులు బతకడానికి అవసరమయ్యేవన్నీ ఊళ్ళలో ఉన్నాయి. మనం తాత్కాలిక సుఖాలమోజులో పడి శాశ్వత దుఃఖాలను కొని తెచ్చుకుంటున్నాం. వాటి ఫలితాలు కరువులు, వర్షాలు తగ్గడం, ఉష్ణోగ్రత పెరగడం లాంటి వాటి ద్వారా మన



"మీరు మాకు తినడానికి ముందు పెట్టిన చకినాలు, గారెలు ఇంట్లోంచి వస్తున్న గంజు పిండి వాసన దేశీయతను గ్రామీణ సంస్కృతీ సాంప్రదాయాలను హృదయానికి హత్తుకున్నారనే చెబుతున్నాయి. ఉద్యోగ రీత్యా, ఇతరత్రా మీరెక్కడ నివసిస్తున్నా మీరు గ్రామాలనే ప్రేమిస్తున్నారనీ అర్థమవుతుంది. ఏముంది సార్ గ్రామాల్లో...? అవి ఫ్యూడల్ కేంద్రాలే కదా...!

అనుభవంలోకి వస్తూనే ఉన్నాయి. ఊళ్ళను సమర్థించడమంటే ఫ్యూడల్ సంస్కృతిని సమర్థించడం కాదు. ఆ సంస్కృతి, అంతరాలు పోవాల్సిందే. సర్వసంపదలను సృష్టించే సృష్టికర్తలను సమున్నతంగా నిలబెట్టే, కులభేదాలు అంతరాలు లేని గ్రామాన్ని నేను స్వప్నిస్తున్నాను. పని సంస్కృతిని ప్రేమించే, గౌరవించే సమాజంలోనే అది సాధ్యమవుతుంది.

నాకు తెలిసినంతవరకు అరవైల వరకు జరిగిన అభివృద్ధిలో మానవాంశ ఉంది. ఆ తర్వాత సుఖవాంఛ పెరిగి శాస్త్రవిజ్ఞానం కూడా మానవ వినాశనానికి ఉపయోగపడేందుకు ఉపయోగపడుతుంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తత. అందుకే అందరూ తమ మూలాలవైపు చూసుకోవాల్సిన అవసరం ఏర్పడింది..."

ఆ యువకులు ఆలోచనలో పడ్డారు. మా మధ్య కొద్ది క్షణాలు మౌనం రాజ్యమేలింది.

"ఊరుపై ఇంత ప్రేమున్న మీరు ఊళ్ళో భూమసలే లేకుండా ఎందుకు చేసుకున్నారు సార్...?"

చేతన్ మాటలతో నాలో దుఃఖం పెల్లుబికి వస్తుంది. ఎంత నన్ను నేను కంట్రోల్ చేసుకున్నా సాధ్యం కావడం లేదు. ఇక ఆపుకోలేక గొడ గొడా ఏడ్చేసాను. కొద్దిసేపాగి కళ్ళు తుడుచుకున్నాను.

"అవును ఊళ్ళో ఉన్న కొంచెమంత భూమి కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. అందుక్కారణాలు మీకు తెలియనివి కావు... నా అనుకున్నవాళ్ళే, నేను ప్రాణంగా భావించిన వాళ్ళే నన్ను ఇంటికి దూరం చేసారు. నాకు ఊళ్ళో ఇల్లు, నిలువ నీడ లేకుండా చేసారు. ఆ బాధతో, కోపంతో ఉన్న కొంచెం భూమి అమ్మి పారేసాను.

నాకు ఊళ్ళో చాపెలుపు భూమి కూడా లేకుండా అవుతుందని నేనారోజు గొడ గొడా ఏడ్చాను... భౌతికంగా ఊరుకు దూరంగా జరుగుతున్నకొద్దీ ఊరుపై ప్రేమ మరింత పెరుగుతుంది. అందుకేనేమో నేను ఈమధ్య రాస్తున్న కథల్లో గతంమీద అనురాగం పెల్లుబుకుతున్నట్టనిపించడం కనిపించడం..." అన్నాను.

"సార్...ఒక్క ప్రశ్న... ఏమనుకోరుగదా...!"

"అనుకుంటానికేముంది జగదీశ్...! నా జీవితమే ఓ తెరచిన పుస్తకం లాంటిది.. అడుగు..."

"మరి మీ అమ్మ...!"

కోటి తవుసులు పట్టి నన్ను కన్నది అమ్మ... నన్ను ప్రాణాధికంగా చూసుకుంది. నా కోసం తపించింది. చేరెడు చేరెడు వడ్లు పోసి పండ్లు కొనిచ్చేది. కందగడ్డ కొనిచ్చేది. బొక్క కూరండితే కరీంనగర్‌లో చదువుకుంటున్న నాకు పంపేది. చదువుకుంటున్న వాళ్ళకు ఎప్పటికీ రంధే ఉంటుందనేది. ఉన్న దాంట్లో మంచివి నాకు పెట్టేది. అలాంటి అమ్మ నాకు దూరంగా ఉండటం పుట్టి పెరిగిన ఇల్లును నాకు కాకుండా చేయడం తీవ్ర వేదనకు గురిచేసింది. నేనెంత మొత్తుకున్నా ఏడ్చినా ఆమె విన్లేదు... పదేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు నా కళ్ళముందు తిరిగాయి.

"జగదేశ్... చేతన్...! అమ్మ తన ఇష్ట ప్రకారమే ఇల్లు తన బిడ్డకిచ్చి ఆమెతోనే ఉంటానంది. అందుకు నేనొప్పుకోక తప్పలేదు. ఈ పని నన్ను శిక్షించడానికి చేసిందో, తనకు అక్కడే సుఖమనుకుందో తెలియదు కాని నాకయితే అంతులేని ఆవేదననే మిగిల్చింది. నేనూరుకు వెళ్ళి అమ్మను కలిసినా పొడిపొడిగా తప్ప మాట్లాడదు. ఆ తరం వాళ్ళలో, ఆ వయసు వాళ్ళలో ఉండే ఆర్ద్రత ఆమెలో కనిపించదు. నేను బయటకెళ్ళొన్నా బయట నుంచి ఇంట్లోకొచ్చినా ఐదు నిమిషాల్లో అన్నం వండి తినుమనే అమ్మ ఈ పదేళ్ళలో ఒక్కసారి కూడా అన్నం తినుమన్లేదు... అంటే, నేను కన్నతల్లి చేతి కూటికి దూరమై పదేళ్ళయింది.

మీరు కథల ద్వారానూ, మా ఊరి వాళ్ళు కావడం ద్వారానూ నా అనుకున్న వాళ్ళకంటెక్కువ నన్నర్థం చేసుకున్న వాళ్ళనిపిస్తుంది. అందుకే అన్ని విషయాలు మీతో మనసు విప్పి చెప్పుకోవాలనుంది. నా కడుపులో దుఃఖ భాండమనే అగ్నిపర్వతముంది జగదీశ్...! అది నేను ఒంటరిగా ఉన్నప్పుడో, ఎవరైనా కదిపితేనో పగిలి వెల్లువై ప్రవహిస్తుంది చేతన్...! నేను తెలిసి ఎవరికీ అన్యాయం చేయలేదు. తెలియకుండానో, పరిస్థితులవల్లో నా తల్లిని నిర్లక్ష్యానికి గురిచేసుంటే దానికి శిక్షననుభవిస్తున్నాను. నా తల్లి ప్రేమకు, చేతి కూటికి దూరం కావడం కంటె గొప్ప శిక్షే ముంది...?"

"మీరేం కోరుతారో నాకు తెలుసు కాని మీకే విషయంలో ఏం కోరికలున్నాయి...?"


"నాకు మా అవ్వ (అమ్మ) గంటెలో తాలుపుపెట్టి వండిపెట్టే పప్పుచారుతో ఉడుకుడుతో గడుకబువ్వ కలుపుకొని తినాలనుంది. కంచుట్లో నూరి పెట్టిన ఎల్లిపాయ తొక్కుతో బువ్వ కలుపుకొని మింగాలనుంది. కొత్త కుండలో ఉడుకబెట్టిన పచ్చి అనుపకాయ, చిక్కుడు గుడాలు బుక్కాలనుంది. కుండలో ఉప్పు, నీళ్ళేసి ఉడుకబెట్టిన గొగ్గిపండ్ల కంకులు కంగాలనుంది. పులుసుపోసి వండిన బుడ్డ పరుకల పులుసుతో అన్నం జుర్రుకోవాలనుంది. డబ్బాగిన్నెల పంపే గడుకంబలి తాగాలనుంది.

(మిగతా 19వ పేజీలో)

# సైన్స్ క్లిప్

-సి.వి.సర్వేశ్వర శర్మ

## రోగ నివారణ మందులు మిత్రులా, శత్రువులా?



రోగ చికిత్సకోసం ఏ మందు ఉపయోగించినా దుష్ఫలితం ఉంటుంది. అయితే చాలా మందులు వల్ల కలిగే లాభం సరిపోల్చుకుంటే ఈ దుష్ఫలితాలను కొన్నింటిని పరిగణనలోకి తీసుకోరు. మందులు తరచు వాడడంవల్ల శరీర నిరోధకత్వం తగ్గడం మాత్రమేగాక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.

ఎక్కువ మందులు తరచు వాడడంవల్ల డోకులు, విరోచనాలు వస్తాయి. వీటివల్ల శరీరానికి ఎంతో ముఖ్యమైన సోడియం, పోటాషియం వంటి ఖనిజాలు ఈ డోకులు, విరోచనాలువల్ల నష్టపోతాం. ఇటువంటి మందులు వాడడంవల్ల శరీరంలో ఈ ఖనిజాలు తగినన్ని ఉండవు.

ఉదాహరణకు యాంటీబయాటిక్స్ వాడడంవల్ల ప్రేగుల్లో ఉండే ఫ్లోరా నశిస్తుంది. శరీరానికి కావలసిన విటమిన్లును ఈ ఫ్లోరా వల్ల తయారవుతాయి. తరచు యాంటీ బయాటిక్స్‌వాడడంవల్ల శరీరంలో విటమిన్లు తయారీ దెబ్బతింటుంది.

అనేక కారణాలుగా మందులు వాడకంవల్ల శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. రక్తంలో ఉండే ప్రోటీన్స్‌కు చాలా మందులు బంధితమై ఉంటాయి. తరచు మందులు వాడడం అంటే రక్తంలో అధిక భాగం ప్రోటీన్లు ఈ మందు అణువులను మోసుకుపోవడానికే వినియోగపడతాయి.

ఏ శరీర ప్రయోజనాలకోసం రక్తంలోని ప్రోటీన్లు నిర్దేశించబడ్డాయో ఆ పనులన్నీ దెబ్బతింటాయి. శరీరంలోని మెటబాలిక్ చర్యలతో మందులు అడ్డుకుంటాయి. ఈ నేపథ్యంలో అనవసరంగా లివరు, మూత్రపిండాలు ఎక్కువ ఒత్తిడికి లోనవుతాయి.

కార్టికోస్టిరాయిడ్స్ వంటి మందులు వాడకంవల్ల శరీరం యొక్క వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గుతుంది. కీళ్ళ నొప్పులు, ఆస్మా, కొన్ని రకాల నేత్ర, చర్మ వ్యాధుల చికిత్సకు, ఎలర్జీలకు, ఇంకా ఇతరములైన రుగ్మతలకు ఈ స్టిరాయిడ్స్ వాడతారు.

అవయవ మార్పిడి చేసిన రోగులకు కూడా ఈ కార్టికోస్టిరాయిడ్స్ ఇస్తారు. ఈ మందుల వాడకంవల్ల రోగి శరీర వ్యాధి నిరోధక శక్తి ఎంత తగ్గిపోతుందంటే ఆ రోగిని రక్షించేందుకు సూక్ష్మజీవులు లేనట్టి వాతావరణంలో ఉంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

ఒక శాస్త్రవేత్త మందులు గురించి మాట్లాడుతూ 'చాలా మంది మనుషులు రోగాల వల్ల చనిపోరు కాని వారు వాడే మందుల వల్ల చనిపోతారు' అన్నాడు.

'మనుషులు వాడే మందులన్నీ సముద్రంలో పారేస్తే మనుషులకు ఎంతో మేలు జరుగుతుంది. కాని పాపం సముద్రంలోని జీవరాశి అంతా నశిస్తుంది' అన్నాడు మరొక శాస్త్రవేత్త. ★

**యాంటీబయాటిక్స్ వాడడంవల్ల ప్రేగుల్లో ఉండే ఫ్లోరా నశిస్తుంది. శరీరానికి కావలసిన విటమిన్లును ఈ ఫ్లోరా వల్ల తయారవుతాయి. తరచు యాంటీ బయాటిక్స్‌వాడడంవల్ల శరీరంలో విటమిన్లు తయారీ దెబ్బతింటుంది.**

---

*(9వ పేజీ తరువాయి)*

ఆమె వండిన రాముల్కాయల కూరతో బువ్వ కలుపుకొని తింటే మంచిగుండనుంది.

ఇవన్నిటీ దూరమైన నేను, ఒక్క ఆప్యాయమైన పలుకరింపుకూ నోచుకోని నేను అంతులేని క్షోభననుభవిస్తూనే ఉన్నాను. ఇది శిక్ష కాదంటారా...?"

మరోసారి నా కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి.

"మనోహర్ సారు హృదయం మెత్తటిది..."

"సార్... మేమొచ్చి మిమ్మల్ని ఏడ్పించినట్టయింది..."

"అదేం లేదు... నాకు ఊరు జ్ఞాపకం వచ్చినా, బాల్యం యాదులు కండ్లముందు తిరిగినప్పుడల్లా దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహిస్తుంటుంది... మనిషి ఏడ్వాలి చేతన్...! తనను తాను ప్రక్షాళన చేసుకుంటానికైనా ఏడ్వాలి. ఏడ్చి ఏడ్చి పునీతుడు కావాలి. తనేంటో తెలుసుకోవాలి. తప్పులు చేయకుండా ఉండడానికైనా ఏడ్వాలి... ఏడ్వాలి..."

"అవును సార్... మీ మాటల్లో ఎంతో లోతుంది..."

"ఈసారి ఊరికి రండి... మీ అవ్వతో చెప్పి మీరు చెప్పిన వంటలు వండిస్తాము..."

నవ్వుతూ అన్నాడు జగదీశ్.

"ఇదేమన్న రాజకీయ నాయకులు గుడిసెల్లో, రోడ్ల వెంట చేసే భోజనం లాంటిదనుకున్నావా జగదీశ్...! మాటలైనా, భోజనం పెట్టడమైనా, తినడమైనా హృదయపు లోతుల్లోంచి రావాలి. మనసు పొరల స్పందనగా ఉండాలి. అలా మా అమ్మ ఒక్కసారి భోజనం పెడితే తినాలనుంది..."

నా మాటలకు అందరి హృదయాలూ భారమయ్యాయి.

"సారీ...! మీ అమ్మ ద్వారా కాని, ఇతరత్రా కాని మీరు కోరుకున్న తీరుగా పెట్టే భోజనం, ప్రేమలు, ఆప్యాయతలు ఊళ్ళలో కూడా ఇప్పుడు లభించడం కష్టం... ప్రతి ఊరూ ఎంతో కొంత రూపాయి మాయలో పడిపోయింది. దీనికి కారణమేంటంటారు...?"

"సుఖవాంఛ... చెప్పాను కదా! తాత్కాలిక సుఖాల కోసం శాశ్వత కష్టాలను కొనుక్కోవడం... ప్రకృతి విధ్వంసం కూడా ఇందులో భాగమనే... ఇవన్నీ పరస్పర సంబంధం కలిగి వుంటాయి..."

"మీరు జీవితానుభవాల ద్వారా, రచనల ద్వారా కోరుకుంటున్నదేంటి...?"

"పల్లీయత..."

"అంటే...?" "మీరనేదేంటి...?"

"పట్టణీకరణం అంటే సుఖం... గ్రామీణీకరణం అంటే సహజత్వం."

అర్బనైజేషన్ (నగరీకరణ) వద్దు...

విల్లేజైజేషన్ (గ్రామీణీకరం) ముద్దు..." అన్నాను.

"మరయితే పల్లెకు పోదాం పద మనోహర్..." అన్నాడు గదిలోకొస్తూ రవీందర్.

"ఎప్పటికయినా పోవాల్సిందక్కడికే... కొంచెం సమయమివ్వు..." అన్నాను నవ్వుతూ.

★